# పెన్నేటి కతలు

## సిత్తాట

"ఆ పరమటి పక్క గుట్టకింది పల్లె లోళ్ళంతా సిత్తాట[1] ఆడే నాయాళ్ళు. ఆ ఊళ్లకు మనట్టాటి కట్టం జేసే రైతులు పిల్లనిస్తారా?... ఛూ!" అనేవాడు నాయిన. అనడమేగాదు ఊళ్ళో గానీ అటూ యిటూ పక్కూళ్లలో గానీ యెవరైనా ఆ గుట్ట కింది పల్లెలోళ్లకు పిల్లనిస్తా వుండారని తెలిస్తే, పోయి సేతనయినంత వరకూ అడ్డంపడేవాడు. అదేందో ఆ ఊళ్ళల్లో ఏ ఇంట్లో జూసినా గానీ సిత్తాట ఆడేవాళ్ళేనంట. ఆ ఊళ్ళల్లోని ఆడపిల్లల్ని ఏ వూరయినా ఇచ్చే తప్పుడు, సేసుకొనే వానికి సిత్తాట ఆడేది వొస్తాదా, రాదా? పెండ్లాని బతికిచ్చుకొంటాడా, లేదా? అని యిశారిచ్చుకొని గానీ యియ్యరంట. నాయిన సిత్తాట ఆడేవానికి పిల్లనియ్యొద్దంటే, వాళ్లె అది రానోనికి పిల్ల నియ్యొద్దంటారు. తల్సుకొంటే నగొస్తాది.

అట్టాటోళ్లకు పిల్ల నియ్యొద్దని నాయిన ఊరికెనే సెప్పడమే గాదు, అత్తను జేసుకొంటా మని రొండు కాండ్ల ఎవసాయం వుండే వాళ్ళొచ్చినా వొప్పుకోలేదు. ఆరోజు... ఏట్లో బరెగొడ్లు కాసే పిలకాయల్తో కర్చి గోలిగుండ్లు ఆడుకొంటా వుండాడు. ఇంతలోకి బండి పోలయ్య వొగిరిస్తా వచ్చి, "మీ రామతుల్చమ్మ అత్తకు పెండ్లంట, పెత్తనానికొచ్చినారని మా యమ్మ సెప్పిందే" అన్నాడు. ఆ మొయిన గోలిగుండ్లు జోబులో యేసుకుని "మాకు తొత్తును[2] సూపిచ్చిపో" అని ఆటాడేవాళ్ళు అర్చుతాన్నా యినిపిచ్చుకోకుండా.. ఉరుకో ఉరుకు!

ఇంట్లో కొచ్చి సూస్తే నలుగురు మొగోళ్ళు ఇద్దరాడోళ్ళు అమ్మతో మాట్లాడతా వుండారు. వాళ్ళు నడముకు బోయి, నడుం మీద సేతులు పెట్టుకోని నిలబడుకోని "పెత్తనానికొచ్చింది యిళ్ళోనామా?" అనడిగినాడు అమ్మను. అందరూ ఒక్కపారి నగిరి. పెండ్లయితే బండ్లు కట్టుకోని ఇంగో వూరికి పోవచ్చని తనకు సంబరం. అయితే, నాయిన ఆ పెండ్లికి ఒప్పుకోలా. వచ్చినవాళ్ళు నాయిన తిడతావుండే గుట్ట కింది పల్లెవాళ్ళేనంట.

"ఆ ఇంట్లో పెద్దోడు సిత్తాట ఆడ్తాడు గానీ పెండ్లి సేసుకోవల్సిన పిల్లోడు ఆడడు గంగిరెడ్డీ, మా మాట యిను" అని వాళ్ళు నెత్తీ నోరు కొట్టుకొని సెప్పినా నాయిన యినక పాయె. "ఆ ఆట ఆడేవాడు వుండే యింటి పక్కడా నా సెల్లెల్ని యియ్యను పోండి" అనె. వాళ్ళు యిసుక్కుంటా పిసుక్కుంటా[3] పోయిరి.



"సిత్తాట అంటే ఏందిమా?" అనడిగినాడు అమ్మను. "అదొక ఆటలే..." అనంది అమ్మ.

"ఆటయితే ఆడ్తే ఏం మల్ల? మేం గోలి గుండ్లు ఆడుకోలా?" అమ్మ నగి, వొళ్ళోకి తీసుకొని "అట్టాటిది కాదులే అది, లెక్కకు ఆడేది" అని సెప్పింది. అప్పుడు ఆ ఆటంటే ఏందో రొంత తెల్సింది.

ఇప్పుడు నాయిన లేడు. అమ్మా లేదు. తను మాత్రం నాయిన బతికినట్టే 'కట్టం జేసే రైతు'గా బతుకుతాండాడు. పెండ్లాం కట్టం జేసేదే, పిల్లలూ జేసేవాళ్ళే. మొత్తం మీద అందరూ కట్టం జేసేవాళ్ళా, కట్టాలు పడే వాళ్ళా. ఇపడెప్పుడన్నా యిదో యిట్ట నాయిన గ్యాపకమొచ్చినప్పుడూ, సిత్తాట ఆడేవాళ్ళను ఆయన సీదరిచ్చుకోడం తల్చుకొన్నప్పుడూ, ఏడ్పాల్నో, నగాల్నో తెలకుండా వుంటాది. అప్పుడు ఆ పరమటి పక్క గుట్ట కింది పల్లెలోళ్ళు అంతా యెందుకు సిత్తాట ఆడేవాళ్ళో ఇప్పుడు తెల్సింది. అసలే గుట్ట కింది పల్లెలు. వానలు కుర్సవు. వానలు కుర్సనప్పుడు వాన మీంద నడిసే యెవసాయానికి ఎన్ని ఎకరాలుండీ యేం పలం? యెవసాయంలో ఎంత కట్టం సేసీ యేం లాబం? అందువల్లనే వాళ్ళు యెవసాయాన్ని నమ్ముకోకుండా కుటంబాల్ని బతికిచ్చుకోడానికి ఆ ఆట నేర్చుకున్నారు!

సిత్తాట ఆడడం సరైన పని కాకపోవొచ్చు. అట్టాటి ఆటాడి పెండ్లాం బిడ్డల్ని సాక్కోవాలనుకోడం తప్పు కావొచ్చు. అయితే, సరైన యిదంగా బతకడానికి పుర్సతుల్యాకపోతే, మనిసి సరైన ఆలోసనా సెయ్యలేడు, సరిగా బతకనూ లేడు. సరిగా బతకకపోయినా, బతకాలనుకొంటాడు కనక ఎట్ట కుదిర్తే అట్ట బతుకుతాడు. దానికి తప్పు పడ్తే ఏం లాబం? యిప్పుడా గుట్ట కింది పల్లెలోళ్ళు సిత్తాట ఆడ్తాండారో, ల్యాక అందునా బతకల్యాక దొంగతనాలే సేస్తాండారో తెల్దు గానీ, మనట్టా యెవసాయం జేస్తావుండే వాళ్ళు సేస్తా వుండేదేంది?

సిత్తాట ఆడుకోడమే గదా, నాయినా? వాళ్ళను సువంతగా తిట్టేవానివిగానీ, నువు బతికినంత కాలం సేసిందేంది? ఇప్పుడు నీ కొడుకు సేస్తా వుండేదేంది? రేపు యీని కొడుకు గుడకా సెయ్యబోయేదేంది? అదే మల్ల!

తొలితా ఏరువాక సేద్యాలు మొదలైన కాన్నుంచీ పంట కళ్ళంలోకీ, అక్కన్నుంచీ కంచంలోకీ వచ్చేదాంకా జరిగే కతంతా యేంది? సిత్తాట ఆడేవాడు ఓడిపోతావున్నా యీసారి గెల్చుతానేమో అనుకొంటా వచ్చినట్టే... యీ[4] యేడు పండుతాదేమో, యీ వాన సక్కరంగా కుర్సుతాదేమో అనుకొంటా వుండాం గదా! అస్సలుకు యెవసాయం జేయడం సిత్తాట ఆడడం కన్నా కనాకస్టం. సిత్తాట ఆడేవాడు ఓడిపోయినా గెల్చినా వాని సేతులారా ఆడతాండాడు. ఆట బాగా ఆడెనా గెల్చుతాడు, లేదా ఓడిపోతాడు. యిదట్టాగాదే! నువెంత బాగా ఆడినా గెల్చలేవు. ఇదింగో రకం సిత్తాట, సిత్తయిపోయే ఆట! అసలాటే నీ సేతిలో లేదు.

మరెవురి సేతిలో వుందబ్బీ అంటే... ఒక్కసెయ్యని సెప్పలేం. వాన సేతిలో వుండేది సరే అదట్టపోనీయ్.. అదొకటేనా? కొనేటప్పుడు అంతా అమ్మేప్పుడు ఇంతా వుండే దరల సేతుల్లో, దరలను పెట్టే పెద్దోళ్ళ సేతిలో, 'ఊర్లముందే ఏర్లు పారిపోతాన్నా పైర్లకు నీళ్ళు పెట్టుకోడానికి ల్యాకుండా జేస్తాండే వాళ్ళ సేతిలో... ఇట్టా ఇందరి సేతుల్లో వుంది. ఎక్కడెక్కన్నోవుండి ఏం సమ్మందం[5] లేని వాళ్ళందరి సేతుల్లో వుంది గానీ, సెమటా నెత్తురూ కార్సి యెల్లకాలం కనిపెట్టుకోని కట్టం సేసే వాడి సేతిలో లేదు యెవసాయం! ఇంత సిత్రం, యింత అన్యాయం యాన్నన్నా వుంటాదా మల్ల?

– రామకృష్ణా రెడ్డి

1. ఒక రకం జూదం 2. దొంగను 3. విసుగుతో, విచారంతో 4. ప్రకమంగా 5. సంబంధం